# ధ్యేయం !

రుసరుస లాడుతూ ఎర్రటి ఎండలో ఇల్లు చేరుకోగానే కాళ్లకున్న చెప్పులైనా విప్పకుండా 'అత్రాష్టుడు ఇంటికొచ్చాడా? వాడి ముఖం చూచి రెండు రోజులైంది. ఇల్లు పట్టకుండా వీధుల వెంట పనికి మాలిన వెధవలతో బలాదూర్ తిరగటం మరిగాడు...' పెళ్లాన్ని ప్రశ్నించాడు వెంకటప్పయ్య.

వెంకటప్పయ్యంటే అల్లాటప్పామనిషేం కాదు. రాష్ట్రంలో ఆయన్ను ఎరుగని వారుండరు. గ్రాంథాలయ కార్యదర్శి చేసి రిటైరైనాడు. మూడు ఎం.ఏ.లు ఆరోజుల్లోనే చదివిన విజ్ఞానవంతుడు. ఆయన చదవని పుస్తకం వుండదు. పనిచేసిన ప్రతి చోట అక్కడున్న పుస్తకాలన్నీ చదివి జీర్ణించుకున్న ప్రతిభాశాలి.

అలాంటి పెద్ద మనిషి కడుపున రామేశం పుట్టినందుకు తిట్టుకోని రోజంటూ లేదు. పండితుడు కడుపున శుంఠపుట్టాడు.

టెన్త్ నాలుగు సార్లు తప్పి ఇక చదువననేసి మొండికెత్తాడు రామేశం. వెంకటప్పయ్య లాంటి పెద్ద మనిషి కడుపున పుట్టాల్సినవాడు కాదు.

ఎనిమిది మంది సంతానం కలిగి పురిటిలోనే సంధి కొట్టి పోయారు... బతికి బట్ట కట్టిన ఒక్కగా నొక్క వంశాంకురం రామేశం!

మగబిడ్డకదా... తలకొరివి పెట్టాల్సినవాడు. పెద్దయితే వుద్ధరిస్తాడని ఎంతో ఆశపడ్డాడు వెంకటప్పయ్య.

ఒక్కగా నొక్క కొడుకు కదా అక్కర కొస్తాడనే ఆశ రోజు రోజుకీ సన్నగిల్లుతోంది.

'ప్రతి విషయానికీ కోపం తెచ్చుకోకండి! బి.పి. ఎక్కువై మీ ఆరోగ్యం చెడుతుంది. వాడి తల రాత ఎట్లావుంటే అట్లా జరుగుతుంది. మనం ఆవేశపడినా దమ్మిడీ ప్రయోజనం వుండదు...' సీతా మహాలక్ష్మి భర్తని బుజ్జగించింది.

'వాడు నీ మాటా వినక... నేనంటే వాడికి అవగింజంతైనా గౌరవం లేక పోతే ఎట్లా చెప్పు? చివరికి ... వీడిగతి అధోగతే!... సరే... ఓ గ్లాసెడు మంచితీర్థం పట్రా.... నాలుక పిడచ కొట్టుకు పోతోంది.... బెడ్‌రూమ్‌లో కెళ్లిన వెంకటప్పయ్య బట్టలు మార్చుకుని వచ్చి సీటౌట్లో వున్న సోఫాలో కూలబడ్డాడు.

భర్తకి మంచినీళ్ల గ్లాసు అందిస్తూ..'మనవాడి జాతకం ఓ మారు సిద్ధాంతికి చూపిద్దురూ..

ఏల్నాటిశని ఇంకా ఎన్నాళ్లు వాడిని ఏడిపించి ఎర్రమన్ను చేస్తుందో తెల్సుకుంటేనైనా... ఏదైనాగ్రహశాంతి చేయిస్తేనైనా... పద్ధతి మారి వాడు దోవకొస్తాడేమో.... తనకు తోచింది చెప్పింది సీతా మహాలక్ష్మి.

'పిండాకూటికైనా వాడు ఇల్లు చేరుకోవటం లేదా?...'కాఫీ గ్లాసు భార్యకిస్తూ నొసలు చిట్లించి అడిగాడు.

'ఇంట్లో ఎంగిలి పడి వారమైంది. అదేమిట్రా అంటే.. ఆకలిగా లేదంటాడు. అసలు చిన్న నాటి నుండి వాడిది ఇదే తీరు. ఏడాది లోపు వయసుండగా.. ఏ మట్టిపడితే అది గుప్పెళ్ళకొద్దీ తినేవాడు... కొన్నాళ్లు బలపం ముక్కలు...చాకపీసులు పళ్లొచ్చాక ... కరకర పకోడీలకు మల్లే నమిలి మింగటం పసికట్టి.. వాటిని దూరంగా వుంచుతూ వచ్చాను. లివర్ కాస్తాపాడై ఎక్కడ రోగం పుట్టుకొస్తుందోని భయపడి చచ్చేదాన్ననుకోండి! పెద్దయ్యాక కూడా ఇదే తంతు! వేళకు తిండి తినడు. వాడేం చిన్నవాడా... చితక వాడా చెవిమెలేసి చెప్పటానికి? మీసాలు గడ్డాలు వచ్చే పిల్లల్నేమనగలం...?' గతాన్ని గుర్తుచేసుకుంటూ..ప్రస్తుత పరిస్థితులను మిళితం చేసి తల్లిగా తన ఆవేదన వ్యక్తం చేసింది.

వంటింట్లోకి వెళ్లబోయిన సీతామహాలక్ష్మి ఆగి వెనక్కు తిరిగి భర్త ముఖంలోకి చూస్తూ 'బైటెక్కడైనా తినేడుస్తున్నాడేమోనండీ..' దీర్ఘాలు తీసింది.

'జులాయిగా వీధుల వెంట పోకిరీ వెధవలతో తిరిగే వీడికి ఈగడ్డురోజుల్లో ఎవరూ మా ధాక వళం పెట్టేది? వెంకటప్పయ్య మాటల్లో ఈసడింపుద్యోతకమైంది.

'బైట తినక.. ఇంట్లోనూ తినకుండా వుంటే... వీడికి ఆకలిఎందుకు కాదూ అనేది నాప్రశ్న. వాడి నోసారి వెంటపెట్టుకుని వెళ్లి ఎవరికైనా ఓ మంచి వైద్యుడికి చూపిద్దురూ... వాడి జబ్బేమిటో తెల్సుకుని మందప్పిస్తేనైనా దారికొస్తాడేమో...

వెంకటప్పయ్యకు చిర్రెత్తుకొచ్చి... 'డాక్టర్ పరీక్షంటే మాటలా?....కన్సల్టేషను ఫీజంటాడు...బ్లడ్..యూరిన్...టెస్టంటాడు.. వందలకు వందలు ఖర్చుపెట్టాలి తెల్సా? వాడికే మాయరోగమూ లేదు... తినకపోయినా... దున్నపోతల్లే తిరుగుతూనే వున్నాడుగా...' కోపంతో రెచ్చిపోయి మాట్లాడేడు.

'మీరు చూడబోతే ఇట్లా... వాడేమో ఆ తీరు! మధ్య నా చావుకొస్తోంది.... ఎవరినీ ఏమీ అనేట్టు లేదు...' గొణుక్కుంటూ కిచన్లోకెళ్లింది.

★★★★★

తండ్రి ఇంట్లో లేడని ఎట్లా తెలుసుకున్నాడో ఒక రోజు మిట్ట మధ్యాహ్నం వేళ ఇంటికొచ్చాడు రామేశం.

కొడుకుని చూచి నిర్ఘాంతపోతూ 'ఎక్కడి కెళ్లావురా ఇన్ని రోజులూ?.... ఊళ్లో నేవున్నావా...

దేశాలు పట్టి తిరుగుతున్నావా?- కన్న వాళ్లనెందుకురా... ఏడిపిస్తావ్? చదువుకోవు... తిండి తినవ్... ఇంటి పట్టు నా వుండకపోతే మా కెంత గాభరాగా వుంటుందో తెలుసట్రా?.... సర్లే... తర్వాత మాట్లాడు కోవచ్చు తీరిగ్గా. నువ్వెళ్లి స్నానం చేసిరా భోజనం చేద్దువుగానీ..' అంది.

'నా భవిష్యత్ గురించి మీరనవసరంగా వర్రీ అవకండి! ఇదిగో ఈ పదివేలూ వుంచు.... పాంటు జేబులోంచి డబ్బు తీసి తల్లి చేతికి అందించాడు' రామేశం.

'ఇంత డబ్బు ఎక్కడిదిరా నీకు. ఎవరింటి కైనా కన్నమేశావా?... లేకపోతే జేబులు కొడుతున్నావా?... కళ్లు పెద్దవి చేస్తూ నిర్ఘాంతపోయి ప్రశ్నించింది.

'ఛ! అదేం కాదమ్మ... నాకు తెలివి తేటలున్నయ్. నా మేధస్సు వుపయోగిస్తూ సంపాదిస్తున్నాను కష్టపడి.

'ఏమిట్రా నీవు పడుతున్న కష్టం?- రిక్షా తొక్కుతున్నావా.. కూలీ పని చేస్తున్నావా...?

'నేనేం చేసి సంపాదిస్తున్నానో... మీక ఇప్పుడు చెప్పను... నా ప్రయోజకత్వం చూచి అందరూ ముక్కుమీద వేలేసు కుంటున్నారు తెలుసా?- నాకు ఆకలిగా లేదు గానీ... నన్ను డిస్టర్బ్ చేయకు.. నిద్రవస్తోంది. నేవెళ్లి పడుకుంటాను...డాడీ వచ్చినా లేపొద్దు...' వడి వడిగా బెడ్‌రూమ్‌వైపు నడిచాడు.

ఉదయం పదిగంటల వేళ భోజనం చేసి ఏదో ముఖ్యమైన పనిమీద బైటికెళ్లిన వెంకటప్పయ్య కొంప చేరుకునే సరికి సాయంత్రం నాలుగు గంటలు దాటింది.

'మంచి తీర్థం ఇమ్మంటారా? - భర్త అందించినపై కండువా అందుకుంటూ అడిగింది.

'వద్దులే...' అక్కడున్న సోఫాలో కూర్చున్నాడు.

'ఎండన పడొచ్చారు.. వుండండి ఫాన్ వేస్తాను...' అంటూ వెళ్లి స్విచ్ వేసింది.

'వెధవది... సీజన్లన్నీ మారిపోయినయ్. రుతుధర్మాలు నాశనమౌతున్నాయ్!.. అన్ని కాలాల్లోనూ... ఎక్కడ లేని ఎండ వీధిలో నడవ నివ్వటం లేదు. అంతలో చినుకు... అంతలో చురుక్కుమనే ఎండ!... ఎట్లా బతుకుతామో ఏమో?.. అలిసిపోవటాన వెనక్కు సోఫాలోవాలి రిలాక్స్ అయినాడు.

'మన రామేశం వచ్చాడు'సంబర పడుతూ చెప్పింది.

'ఇన్నాళ్లూ ఎక్కడ చచ్చాట్ట?-కోపంతో పళ్లుకొరికేడు.

'ఛ'.. అవేం మాటలండీ మరీను...!

'పోన్లే.. వచ్చాడు కదా!.. సంతోషంతో కడుపునిండింది... దొరగారు ఇన్నాళ్లూ

ఎక్కడేడిచాట్ట...? కూర్చున్నవాడల్లా డ్రెస్ మార్చు కోవాలని పక్కనున్న బెడ్‌రూమ్ వేపునడిచాడు.

'అదేం చెప్పలేదు. కానీ... వాడు ప్రయోజకుడైనాడనిపిస్తోంది...'

'అవునా...? అయితే ప్రళయం తప్పదు...

'వేళా కోళం కాదండీ... పదివేలు నా చేతికిచ్చి దాచమన్నాడు...'

'అంతడబ్బే....ఎక్కడ కాజేసుకొచ్చాడో... నీ పుత్రరత్నం...'

'మీకు అంతా పరాచికమే...'

'నువ్ చూస్తూండు... ఈ రోజో రేపో పోలీసులు మనవాడికోసం ఇంటికొస్తారు. అప్పుడు తెలుస్తుంది వాడికా డబ్బు ఎక్కడిదో' వంటి నున్నలాల్చీ విప్పి వొంకీకి తగిలించి... ధోవతి మార్చి... లుంగీ చుట్టుకుని మంచం మీద కాస్సేపు నడుము వాల్చాడు.

'నేను వాడిని అడగవలసినవన్నీ అడిగాను. అన్ని ప్రశ్నలకు వాడొకటే సమాధానం...అదే ఈ డబ్బు వాడు కష్టపడి సంపాదించిందని...'

'చదువు సంధ్య... ఉద్యోగం సద్యోగంలేని వెధవ...వున్నట్టుండీ పదివేలు సంపాదించాడటే... నాకు నమ్మబుద్ధి కావటం లేదు...'

'తిండి ఏమైనా పెట్టావా వాడికి?-'

"ఆకలి లేదు వద్దంటూ నిద్రపోయాడు. మీరు రాబోయేముందే వాడలా వీధిలోకెళ్లాడు... మీకు ఎదురై వుండాలే... మీరు చూడలేదా వాడిని?"

అప్పటికే భర్త నిద్రలోకి జారిపోవడం గమనించి అక్కడి నుండి కదిలింది సీతామహాలక్ష్మి.

★★★★★

వెంకటప్పయ్యకు రాత్రింబవళ్లు కొడుకు గురించే దిగులు!... తనా రిటైరైనాడు. నెలనెలా వచ్చే ఫించనే బ్రతుక్కి ఆధారం! ఆస్తిపాస్తులేమీ లేక పోవటాన.... తను కళ్లు మూస్తే అప్రయోజకుడైన కొడుకు ఎలా బతుకుతాడో అర్థంకాని సమస్యగా కన్పిస్తోంది.

చదువా అబ్బలేదు... టెన్త్ తప్పి కూర్చున్న వాడికి ఏం వుద్యోగం వస్తుంది?..రేపు వాడికి పిల్ల నెవరిస్తారు? బతుకు ఎలా వెళ్లదీయగలడు?... ఇంకా అనేక రకాల ప్రశ్నలు ఆయనను కలచివేస్తున్నాయ్.

కొరగాని కొడుకు పుట్టిన కొరగామియెకాదు తండ్రి గుణములు చెరచున్... అనే పద్యం పదే పదే గుర్తుకొస్తూ... అనుక్షణం మనసులో మెదులుతోంది.

సూర్యాస్తమయం వేళ బజారు పని చూచుకుని ఇంటికొస్తున్న వెంకటప్పయ్యకు... ఆయన

ఆత్మీయ మిత్రుడు నాగభూషణం ఎదురై పలుకరించాడు.

'ఏమో అనుకున్నాను... నీ కొడుకు ఘటికుడే!' ఛలోక్తిగా అన్నాడు నాగభూషణం.

ఆ మాటకి వెంకటప్పయ్య అదిరిపడ్డాడు. ఏం అఘాయిత్యం చేశాడో రామేశం అనే భయంతో మనిషి బిక్క చచ్చిపోయాడు.

లిప్తపాటు నోటమాట కరువైంది. అంతలోనే తెప్పరిల్లుకుని 'మా వాడు నీ వద్ద నా పేరు చెప్పి అప్పేమైనా తీసుకున్నాడా!"

'అదేం లేదులే... భయపడకు! చదువు అబ్బలేదన్నమాటేగానీ మీవాడు అఖండుడనుకో....'

'మీ మాటలు నాకర్థం కావటం లేదు...'

'రండి అలా హోటల్‌లో కాఫీ తాగుతూ మాట్లాడుకుందాం...'

ఇద్దరూ హోటల్లోకి నడిచారు.

'మా వాడు ఎందుకూ కొరగాకుండా పోతున్నాడు. నాదిగులు వాడి గురించే! ఇల్లు పట్టకుండాతిరుగుతున్నాడు. వాడి విషయమే నాకో పెద్ద సమస్యగా అయింది.... 'దిగులుగా మాట్లాడాడు వెంకటప్పయ్య.

'వాడి కొచ్చిన భయమేం లేదు. మీరనవసరంగా మనసు పాడు చేసుకోవద్దు. చదువు అబ్బక పోయినా... సంపాదించే తెలివుంది మీ వాడికి!... రామేశం గురించి అనవసరంగా ఆందోళన చెందకండి! మీకు తెలుసో లేదో... ఏదో ఒకనాటికి వాడు పేరు ప్రఖ్యాతులు ఆర్జించే స్థాయికి తప్పక చేరుకుంటాడు. మీ వాడు ఇప్పుడు స్టేజీ ప్రదర్శనలిచ్చే స్థాయికి ఎదిగాడండీ... మొన్నామధ్య రవీంద్రభారతిలో మీ అబ్బాయి ప్రదర్శన వుందని తెలిసి టిక్కెట్టు కొని మరీవెళ్లాను. తీరా మీవాడిచ్చిన ప్రదర్శన చూచేక నాకు మతి పోయింది. ఎంత అద్భుతమైన అయిటమ్స్ చేశాడండీ!? నా కళ్లను నేనే నమ్మలేక పోయాను.'

నాగభూషణం ధోరణికి విస్తూ పోయాడు వెంకటప్పయ్య.

'మనిషి గొప్పవాడవటానికి చదువే ముఖ్యం కాదని నిరూపించాడు మీ వాడు. మీ వాడి టాలెంట్ గురించి మీకింకా తెల్సినట్టులేదు...!

'నన్ను టెన్షన్‌లో పెట్టి చంపక... విషయం చెప్పరూ...?

'ఒకటా రెండా..?... మీ వాడి 'షో'లో అన్నీ స్పెషల్ ఈవెంట్లే!.... ఇనుపమేకులు మింగటం...ట్యూబ్‌లైట్లను కరకరా నమిలివేయటం... ఇటుకలను పకోడీలా నమిలి మింగటం... బ్లేడు ముక్కలను గుటకాయస్వాహా చేయటం ఒకెత్తైతే... బతికి వున్న బొద్దింకలను... బల్లులను..పాములను... మైసూరు పాకు స్వీట్లు తిన్నట్టు లొట్టలేసుకుంటూ

తినటం.. మీ వాడు మనిషి కాడండీ... బాబూ రాక్షసుడు! వాటిని ఎలా తిని హరాయించుకు బ్రతగ్గలుగుతున్నాడో నాకు బోధపడలేదు. ఇలాంటి సాహస కృత్యాలు చేసే వ్యక్తులు బహు అరుదు. కోటికొక్కడుకూడా వుండడేమో ఈ భూమ్మీదనిపిస్తుంది. మీ వాడు సాహసి! బహుధైర్యవంతుడు!-ఎంత లేదన్నా నిర్వాహకులకు ఖర్చులన్నీ...పోను మీ వాడు షో నిర్వహించినందుకు ఆదాయం పదివేలకుపైబడే వుంటుంది. వాడిని నిరుత్సాహ పర్చకండి! మీ వాడికి ఈ కళ ఎలా అబ్బిందోగానీ.. ఒక నాటికి గిన్నిస్ బుక్‌లోకి మీవాడి పేరు ఎక్కటం ఖాయం! ఇలాంటి ధైర్యశాలి.. మీ కడుపున పుట్టినందుకు గర్వించాలి మీరు...' రాజకీయ నాయకుని ఉపన్యాసంలాగా అలుపెరుగకుండా మాట్లాడేడు నాగభూషణం.

తన చెవులను తానే నమ్మలేక పోతున్నాడు వెంకటప్పయ్య.

'ఇదీ ఒక 'కళే'నండీ! అందరూ చేయలేరీ సాహసకృత్యాలు!.... 'భుజం తట్టి పకపకానవ్వాడు.

★★★★★

ఒకసారి రామేశం ఇచ్చే ప్రదర్శన రాష్ట్ర ముఖ్యమంత్రిగారు స్వయంగా వీక్షించి... అచ్చెరువంది..యాభై వేల రూపాయల చెక్కు గోల్డుమెడలూ...మెచ్చి ఇచ్చి సత్కరించటం కళ్లారా చూచిన వెంకటప్పయ్య దంపతులు కొడుకు ప్రయోజకత్వానికి మురిసారు.

-:(సమాప్తం):-